క్లుప్తంగా

వైభవంగా అయ్యప్ప స్వామి గ్రామోత్సవం



పొదలకూరు: పట్టణంలోని శివాలయం ప్రాంగణంలో ఉన్న అయ్యప్ప స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి గ్రామోత్సవం ఏర్పాటు చేశారు. అయ్యప్ప జన్మదిన వేడుకల్లో భాగంగా ప్రత్యేకాలంకరణలో రథంపై శోభాయమానంగా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మురళీకృష్ణకు పురస్కారం అందజేత



పురస్కారం అందుకుంటున్న మురళీకృష్ణ

ముత్తుకూరు: ముత్తుకూరుకు చెందిన డాక్టర్ జీవీబీ మురళీకృష్ణకు ఆదివారం 'జ్యోతిష్య సేవారత్న' పురస్కారం, 'ఇండియా బెస్ట్ సర్ సీవీ రామన్' అవార్డును అందజేశారు. సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో సర్ సీవీ రామన్ అకాడమీ నిర్వాహకులు విశ్వావసు ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. ఇందులో ప్రఖ్యాత జ్యోతిష్య పండితులు వైవీ శాస్త్రి, సినీ నటుడు కోట శంకరరావుల చేతుల మీదుగా మురళీకృష్ణకు పురస్కారం అందుకున్నారు.

పీఆర్ గుంట పాఠశాలకు గండం



పాఠశాలలో విద్యార్థులు

ముత్తుకూరు: మండలంలోని పోలంరాజుగుంట, వెంకటాచలం మండలంలోని అల్లంవారి కండ్రిగ గ్రామాలకు మధ్య ఉన్న ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పడిపోయింది. కూటమి ప్రభుత్వం స్కూళ్ల బలోపేతానికి చర్యలు తీసుకోకపోవడంతో 8 మందికి గానూ ఆరేడుగురు మాత్రమే నిత్యం పాఠశాలకు హాజరవుతున్నారు. ఈ రెండు గ్రామాలకు చెందిన చాలామంది పిల్లలు ప్రయివేట్ స్కూళ్లలో చదువుకునేందుకు వెళ్లడంతో పీఆర్ గుంట బడి కళ తప్పుతోంది. మూసివేతకు చేరువవుతోంది.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్‌ను ఆటో ఢీకొని ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కోవూరుకు చెందిన దొరబాబు పని నిమిత్తం బైక్‌పై నిడిగుంటపాళెం గ్రామానికి వెళ్లాడు. తిరిగి కోవూరుకు బయలుదేరాడు. గొలగమూడి సమీపంలో ఎదురుగా వచ్చిన ఆటో ప్రమాదవశాత్తు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దొరబాబు గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

బుచ్చిరెడ్డిపాళెంలో..



ప్రమాదంలో గాయపడిన వ్యక్తులు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలో ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్న హరీష్ అనే యువకుడు ఆదివారం మోటార్‌బైక్‌పై నెల్లూరుకు బయలుదేరాడు. రేబాల సమీపంలోని బ్రాందీ షాపులో మద్యం తాగిన మటం కాలనీకి చెందిన ఓ వ్యక్తి రోడ్డుపై తిరుగుతున్న సమయంలో బైక్ ఢీకొంది. దీంతో అతను రోడ్డుపై పడిపోగా బైక్ నడుపుతున్న హరీష్‌కు తీవ్రగాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో నెల్లూరుకు తరలించారు.

ఎస్టీలకు ఉపాధి కల్పించాలి

నెల్లూరు(అర్బన్) : పనులు కల్పించాలని అడగలేని స్థితిలో ఉన్న ఎస్టీలను గుర్తించి వారికి పనులు కల్పించేలా చర్యలు చేపట్టాలని ఉపాధిహామీ క్షేత్ర సహాయకులకు కలెక్టర్ ఆనంద్ సూచించారు. నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఉపాధి హామీ పథకం అమలుపై క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణా కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఉపాధి పనులు ఉపయోగపడుతాయన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం సంచాలకుడు షణ్ముఖకుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా రైతులు ఫామ్‌పాండ్స్ ఎక్కువగా తవ్వించుకునేందుకు సహకరించాలన్నారు. డ్వామా పీడీ గంగాభవాని, క్వాలిటీ కంట్రోల్ అధికారి గోపీచంద్, డ్వామా ఫైనాన్స్ అధికారి కనకదుర్గాభవాని, ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

'రక్త'దారులు

- రోడ్డు పైనే లారీల పార్కింగ్
- తరచూ ప్రమాదాలు
- గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- పట్టించుకోని పోలీసులు

మనుబోలు: మండల పరిధిలోని జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పదుల సంఖ్యలో వాహనచోదకులు మృత్యువాత పడుతుండగా అంతకు రెట్టింపు సంఖ్యలో క్షతగాత్రులవుతున్నారు. మనుబోలు మండల పరిధిలో పొర్లు క్రాస్‌రోడ్డు నుంచి బద్దెవోలు క్రాస్‌రోడ్డు వరకూ 12 కిలోమీటర్ల మేర 16వ నంబర్ జాతీయ రహదారి విస్తరించి ఉంది. దీని వెంబడి పదుల సంఖ్యలో ధాబాలు, టీ, టిఫిన్ అంగళ్లతోపాటు వివిధ రకాల దుకాణాలున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించే లారీల డ్రైవర్లు భోజనం, టిఫిన్ కోసం షాపుల వద్ద ఆగుతుంటారు. అయితే చాలాచోట్ల సరిపడా పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలను ఆపుతుంటారు. ఈ క్రమంలో రాత్రిపూట ప్రయాణించే వాహనచోదకులు ఆగి ఉన్న లారీలను ఢీకొని తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు.

రోడ్డు దాటే సమయంలో..

జాతీయ రహదారి నుంచి రోడ్డుకిరువైపులా ఉన్న వివిధ గ్రామాలకు వెళ్లేందుకు మార్గాలున్నాయి. బద్దెవోలు, యాచవరం, వీరంపల్లి, కాగితాలపూరు, కొమ్మలపూడి, గురివిందపూడి, జట్ల కొండూరుతో పాటు మనుబోలు మండల కేంద్రానికి హైవే నుంచి క్రాస్‌రోడ్లున్నాయి. హైవే నుంచి క్రాస్‌రోడ్ల వద్ద ఆయా గ్రామాలకు వెళ్లే పాదచారులు, వాహనచోదకులు రోడ్డు దాటే సమయంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే హైవేపై ట్రాఫిక్ అధికంగా ఉంటోంది. క్రాస్‌రోడ్డు ఉందని సూచించే సైన్ బోర్డులు సైతం కొన్నిచోట్ల లేకపోవడంతో హైవేపై రాకపోకలు సాగించే వాహనాల డ్రైవర్లకు అక్కడెవరైనా పాదచారులు లేదా బైక్, ఆటోలు తదితరాలు రోడ్డు దాటే అవకాశం ఉందనే విషయం తెలియడం లేదు. పోలీసులు స్పందించి హైవేపై లారీలను ఇష్టానుసారం ఆపకుండా నిలువరించడంతోపాటు, క్రాస్‌రోడ్ల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.



కాగితాలపూరు ధాబా వద్ద హైవేపై ఆగిన లారీలు



కొండూరు సత్రం వద్ద ఇలా..



కాగితాలపూరు క్రాస్ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి

దారి ఉండటం లేదు



హైవేపై ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టాలి. చాలాచోట్ల రోడ్డు పైనే లారీలను ఆపేస్తుండటంతో వాహనాలు వెళ్లేందుకు దారి ఉండటం లేదు. హైవేపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు ఆపకుండా చూడాలి. అలాగే క్రాస్‌రోడ్ల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు వాహనాల వేగాన్ని నియంత్రించాలి.

– ఆవుల తులసీరాం, కొండూరుసత్రం

చర్యలు తీసుకుంటాం



మనుబోలు వైఎస్సార్ సర్కిల్ నుంచి వీరంపల్లి క్రాస్‌రోడ్డు మధ్యలో తరచూ హైవేపై లారీలను ఆపుతున్న విషయం వాస్తవమే. హైవే, దుకాణాలకు మధ్య తగినంత స్థలం లేకపోవడంతో లారీలను రోడ్డుపైనే ఆపుతున్నారు. ఇప్పటికే హెచ్చరించాం. ఇకపై లారీలు ఆపితే అక్కడున్న హోటళ్లు, దుకాణాల యజమానులను బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటాం.

– శివరాకేష్, ఎస్సై

ప్రసన్న ఆశీర్వాదం



ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నంలో ఉన్న శివాలయంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మారుబోయిన సంతోష్, మధు హర్షిత వివాహం ఆదివారం జరిగింది. ఈ వేడుకలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు. పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, పార్టీ నేతలు కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, బట్టీపాటి నరేంద్రరెడ్డి, షబ్బీర్ పాల్గొన్నారు.

నేటి నుంచి పది పరీక్షలు

పొదలకూరు: పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మండలంలో మూడు కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన మొత్తం 751 మంది విద్యార్థులు ఎగ్జామ్స్ రాయనున్నారు. డీఎన్నార్ జెడ్పీ బాలబాలికల హైస్కూళ్లు, చైతన్య స్కూల్, మహ్మదాపురం డీఎస్సార్ జెడ్పీ హైస్కూల్‌ను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 477 మంది, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 274 మంది పరీక్షలు రాస్తారని ఎంఈఓ – 2 శోభనాద్రి వెల్లడించారు.

అమరజీవికి ఘన నివాళి



ఇందుకూరుపేట : డైట్ కళాశాలలో..

పొదలకూరు: పొట్టి శ్రీరాములు జయంతిని స్థానిక బస్టాండ్ సెంటర్‌లో విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అమరజీవి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకుడు ఆదూరు వెంకటసుబ్బయ్య, రాంబాబు, సుధాకర్, మణి, ఖాదర్, సుధాకర్‌రెడ్డి, వేణు, రాము, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

- స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో మహాత్మా గాంధీ విగ్రహ ఏర్పాటుకు ఆర్యవైశ్యులు భూమిపూజ నిర్వహించారు. రూరల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చెంచయ్య మాట్లాడుతూ విగ్రహం ఏర్పాటుకు ఎమ్మెల్యే సోమిరెడ్డి సహకారం అందించినట్టు పేర్కొన్నారు.

త్యాగాన్ని స్మరించుకుందాం

కొడవలూరు: పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంపీడీఓ ఎ.వెంకట సుబ్బారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి మన జిల్లా వాసి కావడం, జిల్లాకు ఆయన పేరే పెట్టుకోవడం మన అదృష్టమన్నారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి రామ్‌ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో..

ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆశ్రమ కమిటీ సభ్యురాలు గంపల మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో..

పల్లిపాడులోని డైట్ కళాశాలలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పొదలకూరు: కేక్ కట్ చేస్తున్న నేతలు



ఇందుకూరుపేట : గాంధీ ఆశ్రమంలో..



కొడవలూరు మండల పరిషత్ కార్యాలయంలో..

గ్రామాల్లో ప్రచారం



పొదలకూరు: త్రైత సిద్ధాంత భగవద్గీతపై మండల కేంద్రం పొదలకూరులో ఆదివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పొదలకూరు కమిటీ అధ్యక్షుడు జి.పెంచలనర్సయ్య, సభ్యులు పాల్గొన్నారు.

కండలేరులో 50.274 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 50.274 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 560, లోలెవల్ కాలువకు 110, హైలెవల్ కాలువకు 80, మొదటి బ్రాంచ్ కాలువకు 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

ముత్తుకూరు: సోమవారం నుంచి మొదలయ్యే పదో పరీక్షలకు సంబంధించి కేంద్రాల వద్ద ముందు జాగ్రత్తగా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టుగా ముత్తుకూరు ఎస్సై విశ్వనాథరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్, గురుకుల పాఠశాల, వీబీఆర్ హైస్కూల్, పిడతాపోలూరులోని రత్నం హైస్కూళ్లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారని, ప్రతిచోట పోలీస్ బందోబస్తు ఉంటుందన్నారు.



పంచాయతీ బస్టాండ్‌లో స్తంభించిన ట్రాఫిక్



బజారు రోడ్డుపై అడ్డంగా నిలిపిన ఆటోలు

ఇష్టారాజ్యంగా..

- పొదలకూరులో అడ్డగోలుగా ఆటోలు
- కొందరు డ్రైవర్ల తీరుతో ట్రాఫిక్ ఇబ్బందులు

పొదలకూరు: పట్టణంలో కొందరు డ్రైవర్లు నడిరోడ్లపై ఆటోలను అడ్డదిడ్డంగా తిప్పుతున్నారు. ఎక్కబడితే అక్కడ నిలుపుతుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండుచోట్ల ఆటోలకు స్టాండ్లు ఉన్నా నడిరోడ్లపైనే నిలుపుతున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీస్ సిబ్బందిని కేటాయించకపోవడంతో నాలుగు మండలాలకు కూడలి అయిన పొదలకూరు పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఆటోలకు తోడు కంకర లారీలు, టిప్పర్లు మెయిన్ రోడ్డుపై తిరుగుతుండటంతో ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. ఈ పద్మవ్యూహం నుంచి తప్పించుకోవడం కష్టంగా మారుతోంది.

సిబ్బంది లేక..

నాలుగు మండలాల వాహనాలు పట్టణం మీదుగా జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరానికి వెళ్లాల్సి ఉంది. ఫలితంగా నిత్యం ఇక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రధానంగా కొందరు ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించకపోవడంతో సమస్యలు వస్తున్నట్లుగా ఇతర వాహనచోదకులు వాపోతున్నారు. పంచాయతీ బస్టాండ్‌లో రెండు బస్సులు ఎదురుపడితే సైడ్ తీసుకోలేకపోతున్నాయి. ట్రాఫిక్ సమస్యలు పోలీసులకు ప్రతినిత్యం తలనొప్పిగా మారాయి. సిబ్బంది కొరత వేధిస్తోంది. పట్టణ ట్రాఫిక్ నియంత్రణకు నిత్యం ఇద్దరు కానిస్టేబుళ్లను కేటాయించాల్సిన అవసరం ఉంది.

మితిమీరిన వేగంతో..

యువకులు కొందరు మెయిన్ రోడ్డుపై ఇష్టానుసారం ద్విచక్ర వాహనాలను మితిమీరిన వేగంతో నడుపుతున్నారు. వృద్ధులు, పిల్లలు బైక్‌ల వేగానికి బెంబేలెత్తుతున్నారు. ట్రిపుల్ రైడింగ్ చేస్తూ కొందరు కేకలు వేస్తూ తిరుగుతున్నారు. వీరిని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు అంటున్నారు. మెయిన్ రోడ్డు సిమెంట్ రోడ్డు కావడంతో బైక్‌లు అదుపుతప్పే ప్రమాదం కూడా ఉంది. పోలీసులు చొరవ తీసుకుని మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాలను నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రంగడి రథోత్సవం



రంగడి రథోత్సవం.. భక్తజన పరవశం

- 'రంగడి' నామస్మరణతో పరవశించిన నెల్లూరు



రథోత్సవం ప్రారంభానికి ముందు..



ఎదురుకోలోత్సవంలో లక్ష్మీనృసింహస్వామి, అమ్మవార్లు

నెల్లూరు(బృందావనం): జై రంగ.. జైజై రంగ.. రంగనాథా రక్షమాం.. పాహిమాం.. గోవిందా.. గోవిందా నామస్మరణతో సింహపురి ఆధ్యాత్మిక చింతనతో పరవశించి పులకించింది. భక్తజన సందోహం నడుమ ఆదివారం రంగడి రథోత్సవం కనులపండువగా జరిగింది. విశేష పుష్పాలతో శోభాయమానంగా తీర్చిదిద్దిన తిరుత్తేరులో ఉభయదేవేరులతో సర్వాలంకారశోభితంగా కొలువైన తల్పగిరి రంగనాథస్వామి రథోత్సవాన్ని వీక్షించేందుకు తరలివచ్చిన వేలాది భక్తజనంతో మాడవీధులు కిటకిటలాడాయి. దాదాపు నాలుగైదు గంటలపాటు రద్దీ కొనసాగింది. రథోత్సవాన్ని విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, బ్రహ్మోత్సవాల చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ జె.శ్రీనివాసరావు, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కుమారుడు శుభకర్‌రెడ్డి తదితరులు గుమ్మడికాయతో దిష్టి తీసి, కర్పూర హారతులిచ్చి గొలుసులు లాగి ప్రారంభించారు. రథచక్రాలపై భక్తులు ఉప్పు, మిరియాలు చల్లుతూ, కొబ్బరికాయలు, గుమ్మడికాయలు కొట్టారు.

- శ్రీరంగనాథ మిత్రమండలి, భజరంగ్‌దళ్, పలు హిందూ ధార్మిక సంస్థల నిర్వాహకులు, యువత, భక్తబృందాలు రంగడిని, గోవిందుడిని స్మరిస్తూ రథోత్సాహంతో ముందుకుసాగారు.
- కాగా ఎదురుకోలోత్సవంలో పట్టువస్త్రాలను రూరల్ ఎమ్మెల్యే సతీమణి సుజిత, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి సమర్పించారు. కమిషనర్ సూర్యతేజ, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు. అలాగే రంగనాథస్వామి ఉభయదేవేరులతో లక్ష్మీనృసింహస్వామికి పట్టువస్త్రాలను చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ జె.శ్రీనివాసరావు, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి అందజేశారు.

పొన్న వాహనోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా తల్పగిరి రంగనాథస్వామికి ఆదివారం రాత్రి పొన్నవాహన ఉత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. పొన్న వాహనోత్సవం ఉభయకర్తలుగా సిద్ధవరపు రామలింగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సుమంత్‌కుమార్‌రెడ్డి, ఎదురుకోలోత్సవం ఉభయకర్తలుగా కొండేటి సుబ్బారెడ్డి కుమారులు వ్యవహరించారు.



ప్రసాదాల పంపిణీ



ఉత్సవం వద్ద నృత్యాలు



టెంకాయలు కొట్టిన మహిళలు